
మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించొద్దు

- వచ్చే ఏడాది మహిళలకు చీరల పంపిణీ
- జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి
- మహిళా సమాఖ్యల ప్రతినిధులతో ఎమ్మెల్యే సమావేశం

**జడ్చర్ల,అక్టోబరు 19 ప్రభాతవార్త:** గ్రామాల్లో అనర్హులైన ఏ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాకుండా మహిళా సమాఖ్యలు, మహిళా సంఘాల సభ్యులు చూసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. డబుల్ బెడ్రూం ఇండ్ల తరహాలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో ఎక్కడా అవినీతి జరగకుండా నిఘా పెట్టాల్సిన బాధ్యత కూడా మహిళా సంఘాలదేనని చెప్పారు. తన నియోజకవర్గంలోని ప్రతి మహిళకు వచ్చే ఏడాది చీరలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన జడ్చర్ల నియోజకవర్గ స్థాయి మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, ఐకెపి సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అనిరుధ్‌రెడ్డి మాట్లాడారు. తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న గ్రామ, వార్డు కమిటీల్లో మహిళా సంఘాలకు చెందిన సభ్యులను కూడా సభ్యులుగా నియమించిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపులో అవినీతి జరిగిందని, ఒక ఇంటి కోసం రూ.2 లక్షల దాకా బిఆర్ఎస్ నేతలు వసూలు చేసి ఎలాంటి అలాట్మెంట్లు లేకుండానే అనర్హులను కూడా తీసుకెళ్లి ఆ ఇళ్లలో పెట్టారని, ప్రస్తుతం అలాంటి వారిని ఆ ఇండ్ల నుంచి తొలగించడం కష్టమౌతుందని తెలిపారు.అయితే ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మహిళా సంఘాలదేనని చెప్పారు. కాగా మహిళలు అంటే తనకు ఎంతో గౌరవం అని అందుకే వచ్చే సంక్రాంతి లేదా ఉగాదికి నియోజకవర్గంలోని మహిళలు అందరికి తాను చీరలు ఇవ్వాలని నిర్ణయించానని వెల్లడించారు.అయితే ఉచిత చీరలు అంటే నాసిరకం చీరలు కాదని, తన ఇంట్లో తన అమ్మ ఏ చీర కడతారో అదే చీరను తాను ప్రతి మహిళకూ ఇవ్వాలని నిర్ణయించినట్లు వివరించారు. సంఘాల్లో ఉన్నా, లేకున్నా అన్ని గ్రామాల్లో ఉండే



మహిళా సమాఖ్య ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మహిళల జాబితాను తనకు తయారు చేసి ఇవ్వాలని మహిళా సమాఖ్య ప్రతినిధులను ఎమ్మెల్యే కోరారు. ఊర్కొండ మహిళా సమాఖ్య భవనం మరమ్మతులకు రూ.లక్ష తాను సొంతంగా ఇస్తానని ప్రకటించారు. మహిళా సమాఖ్యకు కొత్త భవనం కట్టుకోవడానికి 500ల గజాల స్థలం కేటాయించాల్సిందిగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌చేసి కోరగా అందుకు కలెక్టర్ అంగీకారం తెలిపారు. నవాబ్‌పేటలో ఉన్న సీతాఫలాల పల్పింగ్ యూనిట్‌ను సందర్శించి అక్కడున్న సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జడ్చర్ల మండల మహిళా సమాఖ్య భవనం మరమ్మతులకు రూ. 5 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మండలానికి కనీసం ఐదు గ్రామ సమాఖ్యలకు సొంత భవనాలను నిర్మించడానికి ప్రభుత్వంనుంచి, అలాగే కంపెనీల సిఎస్ఆర్‌పథకం నుంచి నిధులను తీసుకొస్తానని అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు.నియోజకవర్గంలోని అన్ని మండలాల మహిళా సమాఖ్యల పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటుగా తనకు వీలైనప్పుడల్లా మండల మహిళా సమాఖ్య సమావేశాల్లోకూడా పాల్గొంటానని చెప్పారు.సమావేశంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన మహిళా సమాఖ్య ప్రతినిధులు, ఏపీఎంలు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు హాజరయ్యారు.

# కళాశాలలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

◆ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ◆ ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలను అకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**కల్వకుర్తి, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** ప్రభుత్వ కళాశాలల్లో చదవుతున్న విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలను శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లెక్చరర్ల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అదే విధంగా తరగతి గదులను పరిశీలించారు. అనంతరం వసతి గృహ గదులను, వంటశాలను, బాత్‌రూమ్స్‌ను పరిశీలించి ప్రిన్సిపల్, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. మంచి ఫలితాలు తెచ్చేందుకు లెక్చరర్లు కృషి చేయాలన్నారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి ఎమైనా ఇబ్బందులు ఉన్నాయా, బోధన పద్దతులు బాగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపల్, స్థానిక నాయకులు ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పీఎంఈజీపీ రుణాలను యువత వినియోగించుకోవాలి : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి అక్టోబర్ 19 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భీమా పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, సురక్ష భీమా యోజన పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం బ్యాంకర్లతో కేంద్ర ప్రభుత్వ భీమా పథకాల నమోదు, ఎస్టీ, ఎస్సి కార్పొరేషన్ రుణాల పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర భీమాపథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన ,సురక్ష భీమా యోజన పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఇవి చాలా ముఖ్యమైన పథకాలని, బ్యాంకర్లు అందరూ సీరియస్‌గా దృష్టి సారించాలని సూచించారు. బ్యాంకు ఖాతాలు ఉన్న వారంతా ఈ భీమా పథకాలకు అర్హులేనని, వారందరికి ఈ భీమా పథకాలు అమలయ్యేలా చర్యలు తీసకోవాలన్నారు.ప్రతి ఖాతాదారు ఇంటికి వెళ్లి వారికి ఈ భీమా పథకాలను వివరించి, నమోదు చేసుకునేలా చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతిలో పంచాయతి కార్యదర్శితో సమన్వయం చేసుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకానికి కేవలం సంవత్సరానికి రూ.430 కడితే రూ.2 లక్షల జీవిత భీమా వస్తుందని, అదే



లీడ్ బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకంలో సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లిస్తే ప్రమాదం జరిగినప్పుడు పాక్షిక అంగవైకల్యం ఏర్పడితే రూ.లక్ష ,శాశ్వత అంగ వైకల్యం ఏర్పడితే రూ.2 లక్షల భీమా వస్తుందని అవగాహన కల్పించాలన్నారు. అయితే, బ్యాంకర్లు స్పందిస్తూ ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించామని బదులిచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల గురించి మాట్లాడుతూ 2018-19లో స్వయం ఉపాధి కొరకు ఎస్సీ శాఖ ద్వారా మంజూరు అయిన 58 సబ్సిడీ రుణాలు గ్రౌండింగ్ కాకపోవడానికి గల కారణాలు ఏంటని బ్యాంకర్లను, ఎస్సీ కార్పొరేషన్ ఈడీని ప్రశ్నించారు.ఆయా రుణాలు వేగంగా గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు -మిగతా4లో..

# పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్లాట్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్

**నారాయణపేట టౌన్,అక్టోబరు 19 ప్రభాతవార్త :** ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని ఆత్మకూర్ రోడ్డుకు వెళ్లే రహదారి పక్కన ఓ యజమాని తనప్లాట్ రెగ్యులరైజేషన్ కోసం ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తును ఆ స్థలం వద్ద ఎల్ఆర్ఎస్ యాప్ ద్వారా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సదరు యజమాని ప్లాట్‌కు ప్రధాన రహదారికి ఎంత మేర విస్తీర్ణం ఉందని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ప్లాట్ రెగ్యులరైజేషన్ దరఖాస్తును యాప్ ద్వారా ఎలా పరిష్కరిస్తారని విషయాన్ని కలెక్టర్ ఫోన్ ద్వారా పరిశీలించారు. రెగ్యులరైజేషన్ కోసం యాప్‌లో ఉన్న ఎంపికలను క్షుణ్ణంగా పరిశీలించి క్లియర్ చేయాలని సూచించారు. ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ మూడు శాఖల అధికారులు సంయుక్తంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. అలాగే మహబూబ్‌నగర్ రోడ్డు మార్గంలోని రైతుబజార్ సమీపంలో 4.20 ఎకరాలలోని పలు ప్లాట్లకు సంబంధించి ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ఎలా జరుగుతుందని, 30 ఫీట్ల రోడ్డు మార్గం వదిలి పెడుతున్నారా లేదా అని యాప్‌లో సూచించిన ఎంపికలపై పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలని ఆమె ఆదేశించారు. మరికల్ తహసిల్దార్ కార్యాలయాన్ని జమీల్‌తో కలిసి పరిశీలించారు. చివరగా ఆత్మకూర్ రోడ్డులో నూతనంగా నిర్మాణమవుతున్న మండల కాంప్లెక్స్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ పావని, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి అరుదైన పురస్కారం



డాక్టరేట్ పురస్కారాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే



కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్,అక్టోబరు 19 ప్రభాతవార్త:** గత 30 సంవత్సరాలుగా రాజకీయంగా ప్రజలకు సేవలు అందిస్తూనే అనేక సామాజిక, సహాయ కార్యక్రమాలు చేపడుతూ ప్రమాదాలలో గాయపడిన వారిని తన చేతులతో తన వాహనంలో ఎక్కించుకుని మరీ ఆసుపత్రులకు తీసుకువెళ్లి సొంత ఖర్చులతో వైద్యం చేయించడం ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నారు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వర్చ్యువల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పాండిచ్చేరి వారిచే గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని శనివారం తమిళనాడు రాష్ట్రంలోని పాండిచ్చేరిలోని కంబన్ కళారై ఆరాగం వేదికగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. పాండిచ్చేరిలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. వాకిటి శ్రీహరి తెలుగులో ప్రసంగించడం పట్ల ఆయనతో ఫొటోలు దిగేందుకు అక్కడి ప్రముఖులు పోటీ పడ్డారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ తన జీవిత కాలంలో చివరి అంకం వరకు ప్రజా శ్రేయస్సు కోసమే పాటుపడతానని ప్రకటించారు. తన సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు డాక్టరేట్‌ను అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న ఎమ్మెల్యేను నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

# మండల విద్యాధికారిగా పల్లెర్ల రఘునందన్

**బిజినపల్లి,అక్టోబరు 19 ప్రభాతవార్త:** బిజినేపల్లి మండల విద్యాధికారిగా పల్లెర్ల రఘునందన్‌ను నియమిస్తూ జిల్లా విద్యాధికారి గోవిందరాజులు శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. వెలుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులైన పల్లెర్ల రఘునందన్ పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు డీఈఓ వివరించారు. మండల విద్యాధికారిగా పని చేసిన కోట్ల భాస్కర్‌రెడ్డి తెల్కపల్లి మండల విద్యాధికారిగా బాధ్యతలు కొనసాగించనున్నట్లు తెలిపారు. నూతన మండల విద్యాధికారి పల్లెర్ల రఘునందన్ మాట్లాడుతూ మండలంలో గల అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నమోదు పెంచడానికి, పదవ తరగతితో పాటు అన్ని తరగతుల విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడానికి, అన్ని పాఠశాలలో వసతుల కల్పనకు మండలంలోని అందరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తామని తెలిపారు.

# గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్

**గద్వాలఅక్టోబర్ 19 ప్రభాతవవార్త:** గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడల్లో విద్యార్థులు, యువత రాణించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. శనివారం సి.యం.కప్ 2024 టార్చ్‌ని సంగాల పార్క్ వద్ద వెలిగించి జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్, ఎస్పీ తోట శ్రీనివాసరావు, గద్వాల్ శాసన సభ్యులు కృష్ణమోహన్ రెడ్డితో కలిసి ర్యాలీని జెండి ఊపి ప్రారంభించారు. టార్చ్ ర్యాలీ పెద్ద సంఖ్యలో హజరైన యువత సంగల పార్క్ నుండి గద్వాల్ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె నుంచి ప్రపంచ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సిఎం కప్ 2024 పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా టార్చ్ ర్యాలీ నిర్వహిస్తుందని అన్నారు. తెలంగాణ నుండి ఒలింపిక్స్ వంటి పోటీలకు క్రీడాకారులు ఎంపిక కావాలంటే గ్రామస్థాయిలోనే టాలెంట్‌ను గుర్తించడం అవసరమని పేర్కొన్నారు. సీఎం కప్ కార్యక్రమం ద్వారా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో మంచి నైపుణ్యత పొందిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో, అంతరాష్ట్ర స్థాయిలో ఒలింపిక్స్‌లో వెళ్లే విధంగా ప్రోత్సాహిస్తామన్నారు. క్రీడల్లో రాణిస్తే




సీఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ సంతోష్

ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పాల్గొన్న నిఖిత జరీన్, టీ 20 క్రికెట్ వరల్డ్ కప్ విజేత మహ్మద్ సిరాజ్ వంటి క్రీడాకారులను ప్రోత్సాహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం డిఎస్పీ స్థాయిలో నియమకాలు ఇవ్వడం జరిగిందన్నారు. క్రీడలు ఇప్పుడు కేవలం ఆటలు మాత్రమే కాకుండా, ఒక ప్రొఫెషనల్ కేరీర్‌గా మారుతాయాన్నారు. మానసిక ఆరోగ్యం ఎంత ముఖ్యమో,శారీరక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని, క్రీడలు వ్యక్తి ఎదుగుదలలో ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల వలన శారీరక ఆరోగ్యంతో పాటు, మానసికంగా దృఢంగా ఉంటామన్నారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడలు ఒకవ్యక్తి శారీరక ఆరోగ్యం, మానసిక దృఢత్వాన్ని మెరుగు పరుస్తుందని అన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వారికి పోలీస్ శాఖలో ప్రవేశించడం సులభం, ఎందుకంటే శారీరక ఆరోగ్యం మానసిక బలాన్ని కలగలిపితేనే ఈ రంగంలో సవాళ్లను అధిగమించగలమని అన్నారు. సీఎం కప్ ద్వారా గ్రామస్థాయి నుండి ఎంపిక అవుతున్న యువ క్రీడాకారులు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గెలుపొందే అవకాశాలను పొందేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహిస్తుందన్నారు. గద్వాల్ శాసనసభ్యులు కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కప్ 2024 ప్రధానంగా గ్రామాల్లో, మండలాల్లో జిల్లాలో క్రీడలో ప్రతిభావంతులను గుర్తించి, ప్రోత్సాహించడమే లక్ష్యంగా నిర్వహించబడుతున్నాయని అన్నారు. మండల, గ్రామ, జిల్లా స్థాయిలో ప్రతి క్రీడాకారుడికి తగిన అవకాశాలు పొందేలా చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రస్థాయిలో జరగబోయే పోటీలలో గద్వాల చెందిన క్రీడలు క్రీడాకారులు సెలెక్ట్, అలాగే రాష్ట్రం నుండి ఒలంపిక్‌లో జరగబోయే క్రీడల్లో కూడా గద్వాల ప్రాంతానికి చెందిన క్రీడాకారులు ఎంపిక కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, బెటాలియన్, డిఎస్పి రఘునాథ్ చౌహాన్, జిల్లా క్రీడా అధికారి బి.యస్ ఆనంద్, అధికారులు , క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

# లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలి

◆ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని డిసెంబర్ నెలలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు రాజీ కుదిరి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి డి.రాజేష్ బాబు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ కోర్టు కాంప్లెక్స్‌లో డిసెంబర్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌పై నిర్వహించిన కోఆర్డినేషన్ సమీక్ష సమావేశంలో జిల్లా న్యాయమూర్తి డి.రాజేష్ బాబు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ కోర్టుల్లో 13762 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అందులో భూ తగాదాలకు సంబంధించి 6236 కేసులు పెండింగ్‌లో ఉండగా, క్రిమినల్ కేసులకు సంబంధించి7526 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. డిసెంబర్‌లో నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగపర్చుకొని ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ కేసులను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పోలీసులకు, వివిధ శాఖల అధికారులకు సూచించారు. గత సెప్టెంబర్ 29న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 20071 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. అదే విధంగా డిసెంబర్‌లో నిర్వహించే లోక్ అదా లత్‌కు అధిక సంఖ్యలో కక్షిదారులు హజరయ్యేలా చర్యలు చేపట్టా లని కోరారు. కోర్టుల నుంచి సమన్లు అందుకున్న వ్యక్తులను కోర్టులో హాజరుపరిచే బాధ్యత పోలీసులపైనే ఉంటుందని తెలిపారు. కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ సబితలు మాట్లాడుతూ పోలీసులు, న్యాయవాదులు అన్ని శాఖల అధికారులు లోక్ అదాలత్‌కు సహకరించాలన్నారు. ప్రతి ఒక్క సామాన్య వ్యక్తికి న్యాయం అందేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామేశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి, న్యాయవాదులు సీఐలు, ఎస్ఐలు, పీపీలు, పోలీసులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు

# మంచి లక్ష్యాలను ఎంచుకోండి

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 19 ప్రభాతవార్త:** విద్యార్థులు మంచి లక్ష్యాలు ఎంచుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో, పూర్వపు విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద (34) మెరిట్ (32) సాధించిన మొత్తం 66 మంది విద్యార్థులను ప్రోత్సహించడం కోసం సుమారు రూ. 4,55,000 స్కాలర్‌షిప్‌లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుండి ప్రతిరోజూ ఏ వార్త చూసిన హెడ్‌లైన్ విద్యపైన కనిపిస్తుందని చెప్పారు. గత పది సంవత్సరాలుగా విద్య, వైద్యం విషయంలో పూర్తిగా వెనుకబడ్డామని అసెంబ్లీలో గణాంకాలతో సహా వివరించానని ఆయన గుర్తు చేశారు. మన రాష్ట్రంలో ఎవరూ చేయలేని ప్రయోగాన్ని స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని 57 ఎకరాల స్థలంలో ఎనిమిది కోర్సులతో ప్రారంభిస్తున్నామని హైదరాబాద్‌లో ఉండే స్కిల్ యూనివర్సిటికి అనుబంధంగా ప్రతి జిల్లాలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఉంటుందని, అందుకు 500 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నామని కార్పస్ ఫండ్‌కు రూ.100 కోట్లు ఆదాని గ్రూప్ అందజేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. స్కిల్స్ కలిగి ఉంటే ఉపాధి,ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, లక్షల మంది పని చేస్తున్న గొప్ప గొప్ప సంస్థలో మీరు కూడా ఉపాధి అవకాశాలు మెరుగు నేర్చుకోవడానికి స్కిల్స్ పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

కోట్లకు వడ్డీలు కట్టుకుంటూ, అభివృద్ధిలో, సంక్షేమంలో ముందుకు సాగుతున్నామని, అలాగే ఎక్కడ అయితే పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయో, వాటిని అప్‌గ్రేడ్ చేస్తూ ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామని, ఐటిఐ కళాశాలలో అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులు ప్రారంభించడం జరుగుతుందని పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, న్యాయ (లా) కళాశాల నిర్మాణం జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ గౌడ్, టిపిసిసి అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌బాబు, డిసిసి ప్రధానకార్యదర్శి సిరాజ్ ఖాద్రి,పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షులు రామేశ్వర్, కార్యదంర్శి శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, కుమార్, శ్రీనివాస్, శ్యాం, రాంచంద్ర, లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు మోతిలాల్, ఉమర్, ఖాజాపాషా, పాపారాయుడు, నాయకులు శ్రీనివాస్ యాదవ్, సల్మాన్ పాల్గొన్నారు.

# నేషనల్ మానిటరింగ్ టీం పర్యటన

**చిన్నంబావి,అక్టోబరు 19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బెక్కెం మియాపూర్ గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ నిధులకు సంబంధించిన వివిధ ప్రభుత్వ పథకాల అమలు ఏ విధంగా జరుగుతుందో ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ మానిటరింగ్ ఆధ్వ ర్యంలో పర్యవేక్షించడం జరిగింది. ప్రభుత్వ పథకాల అమలు సాధించిన పురోగతి తదితర అంశాలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్వహిస్తున్న రికార్డులను, పనులను పరిశీలించారు. ఆసరా పెన్షన్లు పొందు తున్న లబ్దిదారులతో మాట్లాడి వారికి ఎప్పటి నుండి లబ్ది పొందుతున్నారో తెలుసుకోవడం జరిగింది. మహిళా సంఘాల గ్రూపులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎన్ఎల్ఎం బృందం సభ్యులు,జిల్లా అధికారులు సందర్శించారు. కార్యక్ర మంలో నేషనల్ మానిటరింగ్ సభ్యులు ప్రవీణ్ పాటిల్, మధుసూదన్ దేశ్‌పాండే,అదనపు డిఆర్‌డిఓ నాగేంద్రం, ఎపిడి సుల్తాన్, ఎంపిడిఓ రమణారావు, ఎంపిఓ రామస్వామి, అంబు డ్స్‌మన్, సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, రమేష్‌నాయుడు, ఎపిఓ, టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



# ఓవరాల్ రన్నరప్ ట్రోఫి జోగులాంబ గద్వాల జోన్

- రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో కైవసం

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్19, ప్రభాతవార్త:** తెలంగాణ ఏర్పడ్డ తర్వాత నిర్వహించిన మొదటి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఓవరాల్ రన్నర్ అప్ ట్రోఫిని జోగులాంబ గద్వాల జిల్లా కైవసం చేసుకున్నది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఓవరాల్ రన్నరప్ ట్రోఫిని డీజీపీ అభిలాష్ రెడ్డి చేతులమీదుగా జోనల్ అధికారి, అదనపు ఎస్పీ రాములు అందుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పీసీ -1936 శ్రీనివాస్‌రెడ్డి వీడియోగ్రఫీలో సిల్వర్ మెడల్,నారాయణపేట జిల్లానుంచి ఏఆర్‌పీసీ-3341 చంద్రశేఖర్ గౌడ్ యాంటి సబోటేజ్ చెక్‌లో సిల్వర్ మెడల్ పొందడంతో జోగుళాంబజోన్‌కు ఓవరాల్ రన్నరప్ వరించింది. ఈమేరకు డీఐజీఎల్ఎస్ చౌహాన్ అధికారులు సిబ్బందిని అభినందించారు.




రన్నరప్ ట్రోఫి అందుకుంటున్న ఏఎస్పీ రాములు

# ధర్మాపూర్ గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేశాం

- బీటీ రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల నిధులు మంజూరు
- ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తాం
- పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి,కేశం నాగరాజుగౌడ్



ధర్మాపూర్ బీటీ రోడ్డు సర్వే పనులను పరిశీలిస్తున్న పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, అధికారులు

**అమరచింత అక్టోబర్ 19 ప్రభాతవార్త :** ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ధర్మపురం గ్రామ ప్రజలకు బిటి రోడ్డు మంజూరు చేసి రోడ్ వేస్తామని ఎన్నికలు ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి,కేశం నాగరాజుగౌడ్ అన్నారు. ధర్మాపురం గ్రామ బీటీ రోడ్డుకు 2 కోట్లు 20 లక్షల నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనుల సర్వేను శనివారం పిసిసి రాష్ట్ర అధిఇకార ప్రతినిధి,కేశం నాగరాజుగౌడ్, పంచాయతీ రాజ్ డి ఈ ప్రవీణ్ ఏ ఈ విశ్వరెడ్డి, డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్‌తో కలిసి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ, గత టిఆర్ఎస్ పాలనలో గ్రామాలలో రహదారులు లేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గత టిఆర్ఎస్ పాలనలో పూర్తిగా అభివృద్ధి కుంటుపడిందని ఆయన విమర్శించారు. ఎన్నికలలో గ్రామాల ప్రజలకు రోడ్లు వేస్తామని ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందని ఆయన అన్నారు. అలాగే మండలంలోని నందిమల్ల,సింగంపేట గ్రామాలకు రహదారుల నిర్మాణానికి నిధులు మంజురు అయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఆయన అవహేళన చేశారు. ఈ కార్యక్రమంలో కురుమూర్తి స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మనీ వర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అమరచింత పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ ధర్మాపురం గ్రామ అధ్యక్షులు ఆంజనేయులు, శ్రీనివాసులు,పోసిరి గారి విష్ణు,హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పుడమి తల్లికోసం పని చేద్దాం!



స్కూల్ విద్యార్థులతో కమిటీ వేస్తున్న దృశ్యం

**మాగనూరు,అక్టోబరు 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగనూరు, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ బృందం ఆధ్వర్యంలో 6వ తరగతి నుండి 9వ తరగతి పిల్లలను ఇద్దరి చొప్పున స్కూల్ ఎర్త్ క్లబ్‌గా ఎన్నుకొని కమీటీలు వేయడం జరిగింది. ఈ కమిటీలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా పిల్లల అందరు భాగస్వామ్యం అయి భావితరాలకు ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత పిల్లలపై ఉంది. పర్యావరణలో భాగంగా భూమాతను కాపాడాల్సిన బాధ్యత మనందరిది అని మనం మట్టి, గాలి, నీరుకు నిత్యం సంబంధం కలిగి ఉన్నాం. ఇవి లేకపోతే మానవుని మనుగడ లేదని మొక్కల రక్షణ, మొక్కలు పెంచే విధానం, ఔషధ మొక్కల ఉపయోగంపై అవగాహన కల్పించారు. ప్రతి పిల్లవానికి ప్లాస్టిక్ నివారణ, మొక్కల రక్షణ, నీటి నిల్వ చేయడం వంటి పలు అంశాలను పిల్లలకు అవగాహన కల్పించి పుడమి నాయకులను తయారు చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ ఫౌండర్ లక్ష్మారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం మురళీధర్‌రెడ్డి, బాబు సీజీఆర్ మెంటార్ టీచర్, వెంకటస్వామి, ఉపాధ్యాయుల బృందం, సిజిఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ పాలడుగు నగేష్, ఉపాధ్యాయుల బృందం, సిజిఆర్ జిల్లా ఇంఛార్జి కొత్తపల్లి రవి, లీడ్ ఎర్త్ లీడర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యువ నాయకుడి జన్మదినోత్సవం



**పెబ్బేరు అక్టోబర్19 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్‌కు చెందిన శివకుమార్ పుట్టినరోజు సందర్భంగా పెబ్బేర్ మార్కెటింగ్ యార్డ్‌లో కేక్ కట్ చేయడం శాలువా కప్పి జన్మదినం జరిగింది. మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ శ్రీనివాస్ గౌడ్,దయాకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ సురేందంగౌడ్, యుగేంధర్‌రెడ్డి, డైరెక్టర్ రాములు ,మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్,కాటమోని వెంకటయ్య గౌడ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## మృతిడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

**ఇటిక్యాల,అక్టోబరు 19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉదండాపురం గ్రామానికి చెందిన సి. ధనుం జయ అకాల మరణం చెందారు. శనివారం విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు గ్రామానికి చేరుకుని మృతుడు ధనుంజయ భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట పరమేశ్వర్‌రెడ్డి, రఘురెడ్డి, భాస్కర్‌రెడ్డి, దానం, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ అధ్యాపకుడిని సస్పెండ్ చేయాలి

◆ ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు ఎస్.తరుణ్



ఎంఈఓకి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ఎస్. తరుణ్

**కొల్లాపూర్,అక్టోబరు19 ప్రభాతవార్త :** పెంట్లవెల్లి మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ అధ్యాపకుని సస్పెండ్ చేయాలని కోరుతూ ఎంఈఓ ఇమ్మానుయేల్‌కి వినతి పత్రం అందించినభారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కొల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.తరుణ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలోమాట్లాడుతూ ఆన్‌డ్యూటీ పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వెంకటేశ్వరశెట్టిని సస్పెండ్ చేసి ఆయన స్థానంలో మరో అధ్యాపకుని నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే ఆన్‌డ్యూటీ పేరుతో ఆయనకు సపోర్ట్ చేస్తున్న జిల్లా విద్యాధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి పెంట్లవెల్లి మండలంలోని జటప్రోలు గ్రామానికి 70 కి.మీ.దూరం ఉన్న అధ్యాపకుడు ఆన్‌డ్యూటీకి అవసరమా అంటూ ఆయన అధికారులను ప్రశ్నించారు. ఆ పరిధిలోనే ఉన్న అధ్యాపకులను తీసుకుంటే సరిపోతుంది కదాఅంటూ ఆయన విమర్శించారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధ సంబంధం ఏంటో జిల్లాకలెక్టర్ స్పందించి తక్షణమే వారిపైచర్యలు తీసుకునివారి స్థానంలో మరొకరిని నియమించాలని ఆయన కోరారు.లేనిచో ఉద్యమం మరింతఉధృతం అవుతుందనిఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.హనుమంతు,ఎస్ఎఫ్ఐ నాయకులు మంజునాథ్ పాల్గొన్నారు.

## పియూ అధ్యాపకుడికి డాక్టరేట్

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 19 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో ఫార్మసి కళాశాలలో గత దశాబ్ద కాలానికి (2012 నుంచి ఇప్పటివరకు) పైగా అధ్యాపకుడిగా పని చేస్తున్న బైరి సురేష్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ వి. అలగరస్వామి, ఆర్.శ్యాం సుందర్ పర్యవేక్షణలో డిజైన్ సింథసిస్ బయాలజికల్ ఎవల్యూషన్ ఆఫ్ హెటిరోసైక్లిక్ హైబ్రిడ్స్ యాస్ యాంటీ క్యాన్సర్ ఏజెంట్స్, అనే అంశంపై తీసిస్ సమర్పించారు.ఈయన తల్లిదండ్రులు బైరి బాలయ్య, బైరి కళావతి, నిజామాబాద్ జిల్లాకు చెందిన కల్లాడి గ్రామం. ఈ యన విద్యాభ్యాసం పదవ తరగతి జిల్లా పరిషత్ పాఠశాల కల్లడి, ఇంటర్, ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్‌లో బి ఫార్మసి, సెయింట్ పీటర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్, కాకతీయ యూనివర్సిటీ ఎం ఫార్మసీ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ మొహాలి, పంజాబ్‌లో పూర్తి చేశారు. ఈయన విద్యార్థులు పలు ఉన్నత ఉద్యోగాలలో దేశవిదేశాల్లో స్థిరపడ్డారు. ఈయన చేసిన పరిశోధనా పత్రాలు పలు జాతీయ, అంతరాతీయ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పలు సదస్సులలో పత్ర సమర్పణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి, డా. బైరి సురేష్‌ను అభినందిస్తూ ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న క్యాన్సర్ మహమ్మారిని పారదోలాలని, అందుకు హెటేరోసైక్లిక్ కాంపౌండ్స్ క్రియాశీలకంగా పని చేస్తాయని అన్నారు. డా. బైరి సురేష్ మాట్లాడుతూ సుదీర్ఘ ప్రయాణంలో నాతోడున్న నాగురువులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, మిత్రులకు ముఖ్యంగా మా పాలమూరు విశ్వ విద్యాల అధికారులందరికి ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.నూర్జహాన్, హెచ్ఓడి డా.వి.ప్రభాకర్‌రెడ్డి, డా.అర్జున్‌కుమార్, డా.రవికుమార్, డా. భూమయ్య, డా.రవిందర్‌రెడ్డి, డా.వేణు, డా.అరుంధతి, డా.శ్రీధర్‌రెడ్డి, డా.సుదర్శన్‌రెడ్డి, సోమేశ్వర్, డా. రవికాంత్, డా.ఈశ్వర్, రామ్మోహన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.




అధ్యాపకుడిని అభినందిస్తున్న దృశ్యం

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకుందాం

పీటీఎం సమావేశంలో తల్లిదండ్రులకు హెచ్‌ఎం ఎన్.వెంకటేష్ సూచన



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

**అడ్డాకుల,అక్టోబరు 19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పొన్నకల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో శనివారం పిటీఎం సమావేశంలో తల్లిదండ్రులు విద్యార్థులను సమాజంలో బాధ్యతాయుతమైన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి గురువులతో పాటు మీరు కూడా కృషి చేయాలని అప్పులే పిల్లలు తప్పటడుగులు వేయకుండా సరైన దారిలో పయనిస్తారని విద్యార్థులు చక్కగా చదువు నేర్చుకోవడానికి బాటలు పడతాయని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వెంకటేష్ అన్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ క్రమం తప్పకుండా పిల్లలను పాఠశాలలకు పంపాలని, సోమవారం నుండి జరిగే పరీక్షలకు సన్నద్ధం చేయాలని,పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకుని ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దుకుందామని కోరారు. ఈ సమావేశంలో బాగా చదివిన విద్యార్థులను అభినందిస్తూ ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 116 చొప్పున నగదు బహుమతి అందజేశారు. పాఠశాల తల్లిదండ్రుల సమావేశానికి క్రమం తప్పకుండా హాజరవుతున్న (బెస్ట్ పేరేంట్ చంద్రకళను) పాఠశాలకు నూతనంగాబదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు జాకీర్‌పాషా, దొరబాబునుసన్మానించారు.కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ మన్నెంకొండ, పేరెంట్స్ కొండయ్య,కృష్ణయ్య, చిన్న రాములు, కతాల్,రాములు, చంద్రమ్మ,అమృతమ్మ, వెంకటేశ్వర్‌రెడ్డి, చాంద్ పాషాలతో పాటు 48 మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు డి. జనార్ధన్, జాకీర్ భాష, దొరబాబు, స్వాతి, రవినాయక్, అంగన్‌వాడి టీచర్లు సరిత, అమ్రిన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పేరంట్స్

## చదువు ఉంటేనే భవిష్యత్తు ఉంటుంది



అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా సాంస్కృతిక కళాకారులు

**ఇటిక్యాల,అక్టోబరు 19 ప్రభాతవార్త:** చదువుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని సమాజంలో చదువుకున్న వారికి విలువ పెరుగుతుందని తల్లిదండ్రులు ప్రతి చిన్నారి చదువుకునేందుకు పాఠశాలలో చేర్పించాలని బాల్య వివాహాలపై కూడా జిల్లా సాంస్కృతిక కళాకారులు ఆటపాట ద్వారా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో అక్షరాస్యతపై అలాగే చదువుకుంటే కలిగే ప్రయో జనాలపై అవగాహన కల్పించారు.5 సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు చేర్పించాలని అలాగే తమ పిల్లలను పత్తి చేను పొలం పనులకు పంపరాదని కోరారు. చిన్న వయసులో పిల్లలను వ్యవసాయ కూలీ పనులకు తీసుకెళుతున్న సమయంలో వారు పడే బాధలను ఆటపాటల ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. అదేవిధంగా బాల కార్మిక నిర్మూలన చట్టంపై గ్రామ ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక కళాకారులు కేశవులు, కృష్ణ, కవిత,, భూపతినాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైతులను మరోసారి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

◆ బిఆర్ఎస్ నాయకులు ◆ రైతు భరోసా ఇవ్వమన్నందుకు చౌరస్తాలో ధర్నా



కొత్తకోటలో ధర్నా నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నాయకులు



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

**కొత్తకోట అక్టోబర్ 19 ప్రభాతవార్త:** రైతులను మోసం అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో సారి రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వామన్ గౌడ్, మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్, మాజీ సర్పంచ్ చెన్నకేశవ రెడ్డి అన్నారు. శనివారం కొత్తకోట పట్టణ చౌరస్తాలో బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచనతో ఖరీఫ్ సీజన్‌లో ఇవ్వను అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాటలను ఖండిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఉన్నప్పుడు ఖరీఫ్ సీజన్లో రైతులకు రైతు బంధు పైసలు వేశాడని గుర్తు చేశారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి అనేక నిబంధనలు పెట్టి రైతు నోట్లో మట్టికొట్టాడని మండిపడ్డారు.కళ్యాణ లక్ష్మి లక్షతో పాటు తులం బంగారం ఏమైందని విమర్శించారు. 6 గ్యారెంటీలు ఏఒక్కటి అమలు కాలేదని అన్నారు. అనంతరం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ కార్య క్రమంలో ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, కౌన్సిలర్లు ఖాజా మైనొద్దీన్, అయ్యన్న,రవీందర్‌రెడ్డి, నాగన్న, రాములు యాదవ్, మన్యం,నాయకులు శ్రీనుజీ, అద్వానీ శ్రీను,వసీం, వహీద్, లాలు ఆశన్న,నర్సింహాగౌడ్, నాగవర్ధన్‌రెడ్డి, కొన్నూర్ జయంతి, నెహ్రు, శ్యామ్, యాదగిరి, నాగేష్, శ్రీను,మహేష్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ సభను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

**కల్వకుర్తి, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సంతోష్ పేర్కొన్నారు. కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సంతోష్ ఆధ్వర్యంలో 50వ సభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో జార్జిరెడ్డి అమరత్వంతో ఏర్పడిన పీడీఎస్‌యూ అక్టోబర్ నెలతో 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం, సంక్షేమ వసతిగృహం కోసం, శాస్త్రీయ విద్యా విధానం కోసం స్కాలర్‌షిప్ రియంబర్స్‌మెంట్, సమ సమాజ నిర్మాణం కోసం విద్యార్థి సమస్యలపై నిరంతరంపోరాటాలు చేసి అనేక విజయాలను సాధించిందన్నారు. ఓయూ క్యాంపస్‌లో ప్రదర్శన ర్యాలీ, ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే అర్ధశతాబ్ద ఉత్సవాల బహిరంగ సభను విద్యార్థులు, మేధావులు ప్రగతి శీల ప్రజాస్వామికవాదులందరు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.వాల్‌పోస్టర్‌ఆవిష్కరణలో లెక్చరర్లు సదానందం గౌడ్, విద్యార్థులు రామ్, సాయి, కార్తీక్, అర్జున్ ఉన్నారు.

## నవజాత శిశువు మృతి ఘటనపై ఆరా

### వివరాలను తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**జడ్చర్ల,అక్టోబరు 19 ప్రభాతవార్త:** నాగసాలకు చెందిన కీర్తి కాన్పు కోసం జడ్చర్ల ఏరియా దవాఖానలో బుధవారం రాగా వైద్యులు సమయానికి అందుబాటులో లేకపోవడంతో నర్సులు డెలివరీ చేయడంతో శిశువు మృతి చెందిన సంఘటనపై బిఆర్ఎస్ నాయకులు శనివారం దవాఖానకు వెళ్లి ఆరా తీశారు. దవాఖాన సూపరింటెండెంట్ చంద్రకళను వివరాలు అడిగారు. బాధితురాలు ఆరు గంటలపాటు దవాఖానలో ఉన్నా డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించినందు వల్లే శిశువు మృతి చెందిందని నాయకులు ఆరోపించారు. గైనకాలజిస్టు అందుబాటులో లేనందు వలన దారుణం చోటు చేసుకుందన్నారు. వైద్యులు నర్సులు సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇలలా జరిగిందని సూపరింటెండెంట్‌కు వివరించారు. ఆసుపత్రిలో సరైన సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, ఆ సమయంలో వైద్యులు అందుబాటులో ఉన్నారని సూపరింటెండెంట్ చంద్రకళ చెప్పారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని నాయకులు సూపరింటెండెంట్‌ను కోరారు. కార్యక్రమంలో కోడ్గల్ యాదయ్య, కౌన్సిలర్ సతీష్, ప్రణీల్‌చందర్, రాంమోహన్, ఇంతియాజ్ ఖాన్, కొండల్, కరాటే శ్రీను పాల్గొన్నారు.

## శ్రీకురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

**చిన్నచింతకుంట, అక్టోబరు19 ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడి ప్రతిరూపంగా కొలవబడుతూ, పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న శ్రీకురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు శనివారం నిర్వహించారు. ప్రతిరోజు స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చేభక్తజనం కానుకల రూపేణా హుండీలో వేసిన నగదును ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, దేవస్థాన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో లెక్కించగా రూ. 3,18,276 ఆదాయం రావడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, భాస్కరాచారి, కమలాకర్,శ్రీధర్‌రెడ్డి, గోపాల్, భక్తులు కురుమూర్తి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన




కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

**బిజినేపల్లి,అక్టోబరు19 ప్రభాతవార్త:** నంది వడ్డెమాన్ గ్రామంలో ఎన్ఆర్ఐలు తిప్పిరెడ్డి రామచంద్రారెడ్డి నిరంజనీదేవి దంపతుల సహకారంతో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై వారిచే నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తుంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు తమ కంటి చూపుకు సంబంధించి పరీక్షలు నిర్వహించుకుని వైద్యుల సలహాలు తీసుకుంటున్నారు. కంటిపొర ఉన్నవారికి అక్కడే ఉచితంగా కంటిపొర చిక్సి నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల వారు సైతం ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శెట్టి జగత్ చంద్రయ్య, వీరశేఖరాచారి, శంకర నేత్రాలయ కంటి వైద్యశాల కో ఆర్డినేటర్ రాజు, డా. శంకర్, డా. స్వర్ణిమ, సిబ్బంది సత్యరాజ్, వెంకటేష్, కృష్ణమూర్తి, భాను ప్రశాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మంచి భవిష్యత్తును ఎంచుకోవాలి



**పెబ్బేరు అక్టోబర్ 19 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు ప్రాథమిక పాఠశాల యాపర్లకు శనివారం పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా సందర్శించారు. వారు పిల్లలతో ముచ్చటిస్తూ విద్యార్థులందరూ సోమవారం నుంచి జరిగే సమ్మేటివ్ పరీక్షలకు అనుపస్థితి కాకుండా, చక్కగా పరీక్షలు భయపడకుండా రాయాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల యాపర్ల ప్రాంగణంలో మొక్క నాటారు, ఆ మొక్కను పెంచడానికి ట్రీ గార్డ్ ను బహుకరించాడు.ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొల్లు హుస్సేన్ యాదవ్,ఇతర ఉపాధ్యాయులు కలిసి జిల్లా విద్యాధికారినిసన్మానించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కాంపెక్స్ హెడ్మాస్టర్ నరసింహారావు,ఉపాధ్యాయులు మురళీకృష్ణ, భాగ్యలక్ష్మి అదే విధంగా గ్రామస్తులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపాలి




మాట్లాడుతున్న మండల విద్యాధికారి బషీర్ అహ్మద్

**లింగాల,అక్టోబరు 19 ప్రభాతవార్త:** పిల్లలను ప్రతిరోజు పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. శనివారం మండల పరిధిలోని జీల్గుపల్లి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం యుపిఎస్ కోమటికుంట పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైనభోజనం అందించాలనికోరారు.నూతనంగా విధుల్లో చేరిన బాకారం పాఠశాలలఉపాధ్యాయులకు పాఠశాలసమయ పాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు.కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముఖాభినయంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన శాంతినికేతన్ విద్యార్థులు

**తెల్కపల్లి,అక్టోబరు 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శాంతినికేతన్ విద్యాలయానికి చెందిన విద్యార్థులు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నేషనల్ హైస్కూల్లో ఈనెల 16,17 తేదీలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర శిక్షక్, కళా ఉత్సవ్ 2024 పోటీలలో శాంతినికేతన్ విద్యాలయానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు వినోద్‌కుమార్, భరత్, అజయ్‌గౌడ్ తొమ్మిదవ తరగతికి చెందిన చరణ్‌తేజ్, జస్వంత్‌రెడ్డి పాల్గొని మైమ్ (ముఖాభినయం) విభాగంలో జిల్లా స్థాయిలో విద్యార్థులు ప్రథమ బహుమతి దక్కించుకుని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ సురెందర్‌రావు తెలిపారు. రాష్ట్రస్థాయికిఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ సురెందంరావు, ప్రిన్సిపాల్స్ ఇంద్రకుమార్, దీపా, సెబస్టియన్, ఉపాధ్యాయులు, మండల ప్రజలు అభినందించారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన శాంతినికేతన్ విద్యార్థులు

